
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
3
శనివారం 19 జూలై 2025



చెత్తపై చిత్తశుద్ధి కరువు

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హుస్నాబాద్ మినహా

పడిపోయిన మున్సిపాలిటీల ర్యాంకులు

దుబ్బాక, జూలై18(ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ, నిర్వహణలో జిల్లా అధ్వానస్థితికి చేరుకుంది. ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ నిర్వహించిన స్వచ్ఛసర్వేక్షణ్ 2024-25 సర్వేలో జిల్లాలోని హుస్నాబాద్ మినహా మిగిలిన మున్సిపాలిటీలు కనీస ర్యాంకుకు చేరుకోలేదు. చెత్త సేకరణ, డంప్‌యార్డుల నిర్వ హణలో చేర్యాల వెనుబడింది. స్వచ్ఛసర్వేక్షణ్‌లో తడి, పొడి చెత్త సేకరణ, ఇంటింటా చెత్త సేకరణ, వ్యర్థాలను వేరు చేయడం, బహిరంగ మల విసర్జన, నగరాల పారిశుధ్యంపై సర్వే నిర్వహించారు. ఇందులో మున్సిపాలీటీల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయి ర్యాంకులు ఇలా ఉన్నాయి.

మున్సిపాలిటీ	స్కోర్	రాష్ట్రస్థాయి	జాతీయస్థాయి
1. హుస్నాబాద్	8899	9	139
2. గజ్వేల్	7865	35	377
3. సిద్దిపేట	6692	73	448
4. దుబ్బాక	6087	97	946
5. చేర్యాల	3511	142	1815



పదోతరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్

కలెక్టర్.. టీచర్

- మర్కుక్‌లో కలెక్టర్ హైమావతి పర్యటన
- అభివృద్ధి పనుల పరిశీలన..

మర్కుక్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం కలెక్టర్ హైమావతి అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. మర్కుక్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడి భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. కాసేపు ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం వారితో మాట్లాడారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా కూడా ఇష్టపడి చదువుకోవాలన్నారు. మైదానంలో ఆటలు ఆడుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లి టైంపాస్ కోసం కాదని, నిబద్ధతతో ఆడాలన్నారు. కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, మర్కుక్ మండల పీఆర్టీయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై సీరియస్

కలెక్టర్ హైమావతి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు తహసీల్దార్ కార్యాలయా న్ని సందర్శిస్తున్నప్పుడు మోరీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను చూసి పంచాయతీ కార్యదర్శి శాంతిపై సీరియస్ అయ్యారు. అపరిశుభ్రంగా ఉన్న మోరీలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి తనకు ఫొటోలు పెట్టాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని మండల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్‌ను ఆమె ఆదేశించారు.



సంగారెడ్డి దుర్గమ్మ తల్లి జాతరలో పోతరాజు నృత్యాల్లో జగ్గారెడ్డి

దుర్గమ్మ తల్లి జాతరలో
జగ్గారెడ్డి జోష్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి)

సంగారెడ్డిలోని దుర్గమ్మ తల్లి జాతర శుక్రవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొని జోష్ నింపారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల నృత్యాల నడుమ ఏర్పులామె రంగం చదివి వినిపించింది. అనంతరం భక్తుల కోలాహలం మధ్య జగ్గారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో వర్షాలు కురుస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదలు, బడుగు బలహీనవర్గాలకు మంచి రోజులు వచ్చాయని చెప్పారు. ఈ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తోపాజి అనంతకిషన్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో పాటు రంగం వింటున్న జగ్గారెడ్డి

ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

- సీపీ అనురాధ



సిద్దిపేట క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఒక్క ఫిర్యాదుదారుతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలని సీపీ అనురాధ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్, మహిళ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి మాట్లాడారు. స్టేషన్ పరిసర ప్రాంతాను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ రికార్డ్, రైటర్ రూంను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు .పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసులలో ఉన్న వాహనాల అడ్రస్ తెలుసుకుని సంబంధిత యజమానులకు అప్పగించాలని సంబంధిత సీఐ వాసుదేవరావుకు సూచించారు.

నిత్యం ఆకాశానికేసి ఆశతో ఎదురుచూపులు.. వరుణుడు కరుణించాలని కప్పతల్లి ఆటలు.. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. చినుకు జాడ లేక పంటలు ఎండిపోతూ.. అన్నదాతలు ఆశలు చాలించుకుంటున్న తరుణం.. నిన్నా, మొన్నటి వరకు ఆకాశంలో దట్టంగా కారు మబ్బులు కమ్ముకుని ఊరించి ఉసూరుమనిపించిన వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. శుక్రవారం జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. అన్నదాతల్లో హర్షం వ్యక్తమైంది.

కరుణించిన
వరుణుడు

జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం

- పంటలకు జీవం..
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఈ సీజన్‌లో ఇదే భారీ వాన



చేర్యాల గాంధీచౌక్ వద్ద నిలిచిన వరదనీటిలో ప్రయాణికుల ప్రయాస



అక్కన్నపేట మండలం నందారం, కపూర్‌నాయక్ తండా మధ్య పొంగిపొర్లుతున్న వాగు

చేర్యాల/తొగుట/సిద్దిపేట కల్చరల్/అక్కన్నపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర గడిచినా ఆశించిన వర్షం కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో శుక్రవారం భారీ వర్షం కురవడంతో కాస్త ఊరట చెందారు. వరి, మక్క, పత్తి పంటలకు జీవం పోయడంతో హర్షం వెలిబుచ్చారు. భారీ వర్షం కారణంగా చేర్యాలలోని అంగడిబజారు, గాంధీ చౌరస్తాతో పాటు ఆర్టీసీ బస్టాండు ఆవరణ జలమయమైంది. డ్రైయినేజీలోకి నీరువెళ్లే మార్గం లేకపోవడంతో రోడ్డువెంబడి పలు ప్రాంతాల్లో నీరు నిలిచింది. గాంధీచౌక్ వద్ద కల్వర్టు నిర్మాణం పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో కడవేరు గుకు వెళ్లే మార్గం, పోచమ్మవీధికి వెళ్లే మార్గంలో నీరు నిలిచింది. దీంతో వాహనదారులు, బాటసారులు తంటాలు పడ్డారు. నాలాల మూసివేతతో సెవెన్‌హిల్స్ వెనకభాగంలోని ఇళ్లు జలమయమయ్యాయి. తొగుట మండలంలోని వివిధ గ్రామాల్లోనూ భారీ వర్షం కురిసింది. పంటలకు జీవం పోసినట్లయింది. అక్కన్నపేట మండలంలోని



సిద్దిపేటలో..

మిగతా 6వ పేజీలో

పలకరింపు.. పరిశీలన.. పరిష్కారం

- హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మార్నింగ్ వాక్
- అభివృద్ధి పనులు పరిశీలన, వినతుల స్వీకరణ
- ఆసుపత్రిలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆదేశం



మున్సిపల్ సిబ్బంది ప్లాస్టిక్ బాటిళ్లతో తయారు చేసిన హెలికాప్టర్‌ను తిలకిస్తున్న మంత్రి

హుస్నాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో శుక్రవారం ఉదయం రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మార్నింగ్ వాక్ చేస్తూ ప్రజల నుంచి వినతులు, యోగా క్షేమాలతో పలకరింపులు, అభివృద్ధి పనుల పరిశీలనలు, పలు సమస్యలకు పరిష్కారాలు చూపారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి మార్నింగ్ వాక్ నిర్వహించగా రైతు బజార్ వద్ద మున్సిపల్ సిబ్బంది తయారు చేసిన ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లతో తయారు చేసిన హెలికాప్టర్‌ను తిలకించారు. శివాలయం, బుడిగ జంగాల కాలనీలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. పట్టణంలోని ఆరెపల్లి చౌరస్తాలో సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన త్రిశూల ఫౌంటెన్‌ను అక్కడి నాయకులతో కలిసి ప్రారంభించి అక్కడ మొక్కలు నాటారు. ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి రోగులతో రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య సిబ్బందికి టీ షర్టులు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రజల సహకారంతో రాష్ట్రంలో 9వ స్థానంలో అవార్డు రావడం హర్షనీయమన్నారు. రాబోయే కాలంలో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుతానన్నారు. ఇప్పటికే గ్రామగ్రామాన స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేయడం పట్ల స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, కొత్తపల్లి అశోక్ మంత్రి పొన్నంను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, చిత్తారి రవీందర్, బంక చందు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోమటి సత్యనారాయణ, చిత్తారి పద్మ, అక్కు శ్రీనివాస్, వివి రమణ, గంపల శ్రీనివాస్, రాధ తదితరులున్నారు.

హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం రాత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ప్రయాణికులతో మాట్లాడారు. బస్ స్టేషన్ పెండింగ్ పనులపై ఆర్టీసీ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ఫోన్లకే పరిమితం కాకూడదు

- మంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి
- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు/సిద్దిపేటరూరల్ జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఫోన్లకు పరిమితం కాకుండా మంచి పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. గతంలో పదోతరగతి ఫలితాల్లో సిద్దిపేట రాష్ట్రంలోనే మొదటి, ద్వితీయ స్థానాల్లో ఉండేదని, కొత్త ప్రభుత్వం వచ్చాక సిద్దిపేట 24వ స్థానానికి పడిపోవడం బాధాకరమన్నారు. చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు అంతకు ముందు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. ఇప్పుడు డిజిటల్ యుగమని, కేవలం బోర్డులు, పుస్తకాలు సరిపోవని విద్యార్థులకు కంప్యూటర్‌లు అవసరమని తెలిపారు. సిటిజన్ క్లబ్ సిద్దిపేట వారి సహకారంతో విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలోని పెద్ద చెరువు కట్టపై లైట్ మోటర్ వెహికిల్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో హరీశ్‌రావు పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు సదానందం, కనకరాజు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, ఏంఈవో యాదవ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

- సిద్దిపేటరూరల్ మండలం పుల్లూరులో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత ఉత్సవాల్లో పూజలు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీహరిగౌడ్, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మురళీ, మాజీ సర్పంచ్ పల్లె నరేష్ నాయకులు వెంకట్, తిరుపతి పాల్గొన్నారు.



చిన్నకోడూరు హైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ శ్రీనివాస్



మర్పడగ క్షేత్రంలో
రాహుకాల పూజ

కొండపాక, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శుక్రవారం రాహుకాల పూజను క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే సంతాన మల్లికార్జున స్వామి వారి అభిషేకం నిర్వహించారు. ఉదయం పది నుంచి ఒంటి గంట వరకు రాహుకాల పూజ శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం పల్లకీసేవ నయనానందకరంగా సాగింది. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, చీకోటి రాజేంద్రప్రసాద్, సిల్వేరు శ్రీనివాస్, లగిశెట్టి రాజు, మర్యాల రవీందర్ పాల్గొన్నారు.



తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి
నీరు విడుదల

కొమురవెల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల పంపింగ్ తిరిగి శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. ఫేజ్-3 పంపు ద్వారా రిజర్వాయర్‌లోకి 100 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు డీఈ అంజయ్య తెలిపారు. పంపింగ్ ప్రారంభమైనా సాంకేతిక కారణాలతో ఆగిపోవడంతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధికారులతో మాట్లాడి త్వరగా పంపింగ్ చేపట్టాలని ఆదేశించడంతో ప్రారంభించారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

బెజ్జంకి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుగ్గిళ్ల క్రాస్ రోడ్డు వద్ద ఇసుక లోడ్‌తో వెళ్తున్న వాహనాన్ని శుక్రవారం ఎస్ఐ సౌజన్య అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో ఓ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సీజ్ చేశారు.

తరగతి గదిలో
కుప్పకూలిన ఉపాధ్యాయుడు
- గుండెపోటుతో పీర్లపల్లిలో టీచర్ మృతి
4

నమూనాయే లేదు..
అవగాహన ఎలా?
- చిన్నకోడూరులో పిల్లర్ గుంతలకే పరిమితమైన ఇందిరమ్మ మోడల్ హౌస్
- ముందుకు సాగని పనులు
6

ఎప్పటికప్పుడు
అప్‌డేట్ కావాల్సిందే
- కొత్త విషయాలు నేర్చుకోవాలి
- సామాజిక మార్పులకనుగుణంగా మారాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
5

మైదాకు ముచ్చటం

నంగునూరు/సిద్దిపేటకల్చర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం సంబరాల్లో భాగంగా శుక్రవారం నంగునూరులోని గల్లీకా గణేష్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఒకే రకమైన చీరలు కట్టుకుని గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోనూ గోరింటాకు సంబురాలు నిర్వహించారు. సిబ్బంది, విద్యార్థినులు మైదాకు పెట్టుకుని సందడిగా గడిపారు.



సిద్దిపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..



నంగునూరులో ఒకే డ్రెస్‌కోడ్‌తో గోరింటాకు సంబరాల్లో పాల్గొన్న మహిళలు



కోహెడ మండలం తంగళ్లపల్లిలో ఆర్టీసీ బస్సు వద్ద పూజ చేసిన గ్రామస్తులు

కోహెడ మీదుగా
బస్సుల పునరుద్ధరణ

కోహెడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూరెళ్ల, తంగళ్లపల్లి గ్రామాలకు కొత్త ఆర్టీసీ బస్సులు రావడంతో గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. కోహెడలో స్టీల్ బ్యాంక్ ప్రారంభానికి వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖలు కలిసి వేములవాడకు నూతనంగా ఆర్టీసీ బస్సులు ప్రారంభించారు. గతంలో కోహెడ మండలం నుండి హైదరాబాద్, వేములవాడ, సిద్దిపేట, బెజ్జంకి, హనుమకొండకు ఆర్టీసీ బస్సులు నడిచేది. ఆ బస్సులను అకారణంగా రద్దు చేశారు. వాటిని తిరిగి పునరుద్ధరించాలని మండల ప్రజలు మంత్రి పొన్నం ప్రభాకర్ వద్ద మొరపెట్టుకోవడంతో మంత్రి కూరెళ్ల, తంగళ్లపల్లి, గుండారెడ్డిపల్లి మీదిగా హైదరాబాద్ బస్సును మళ్లీ పునరుద్ధరించారు. అలాగే నూతనంగా కోహెడ నుంచి వేములవాడ వరకు బస్సు సౌకర్యం కల్పించారు.

పోలీసుల ప్రతిభ వెలికి తీయాలి: ఎస్పీ



డాగ్ స్క్వాడ్ పరీక్షలు

సంగారెడ్డి క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పోలీసుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జోనల్ డ్యూటీ మీట్‌ను ప్రారంభించారు. గత నెలలో నిర్వహించిన జిల్లా స్థాయి డ్యూటీ మీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయిలో ఎంపిక కోసం సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన 58 మంది అధికారులు, సిబ్బంది, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీంలకు జోనల్ స్థాయి డ్యూటీ మీట్ నిర్వహించారు. ఇందులో ఎంపికైన వారు ఈనెల 26న వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌లో పాల్గొంటారు. ఈసందర్భంగా ఎస్పీ పంకజ్ మాట్లాడుతూ.. నేరం జరిగిన తర్వాత నేరస్థలాన్ని ఏ విధంగా ప్రొటెక్ట్ చేయాలి, నేర స్థలంలో క్లూస్ ఏ విధంగా సేకరించాలి, కంప్యూటర్ పరిజ్ఞానం, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ పనితీరుపై పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఈనెల 26న వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌లో జిల్లా పోలీసులు సత్తా చాటాలన్నారు. పోలీసుల పనితీరుకు అద్దం పట్టే విచారణలో మెలకువలను నేర్చుకోవాలని సూచించారు. సరైన పద్ధతిలో కేసులు దర్యాప్తు చేస్తే ప్రజల్లో పోలీసుల పట్ల మరింత నమ్మకం పెరుగుతుందన్నారు.

ఆధార్ సెంటర్ ఎక్కడ..?



గుమ్మడిదల మున్సిపాల్టీ కార్యాయలం

- ముున్సిపాలిటీగా మారినా మోక్షం లేదా?
- ఆరేళ్లుగా ఆధార్ సెంటర్ లేక ఇబ్బందులు
- ప్రజల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు

గుమ్మడిదల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో కొన్ని సంవత్సరాలుగా ఆధార్ సెంటర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తమ అవసరాల కోసం, పిల్లల చదువుల కోసం ఆధార్ తప్పనిసరి అని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రజలు ఆధార్ కోసం నానా తిప్పలు పడుతున్నారు. మున్సిపాలిటీగా గుమ్మడిదల ఏర్పాటు చేసినప్పటికీ ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆధార్ కోసం రోజు పక్క జిల్లా మెదక్, మేడ్చల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆరు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల చదువులు, పెన్షన్లు, గ్యాస్ సబ్సిడీలు, బ్యాంకు ఖాతా తెరిచే పని ఏ అంశానికైనా ఆధార్ అవసరం. నిత్యం పనికి వెళ్లే కార్మికులు, కూలీలు తమ రోజువారీ ఆదాయాన్ని కోల్పోయి మెదక్, మేడ్చల్ వంటి జిల్లాలకు వెళ్లి ఆధార్ సర్వీసుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ఆధార్ కేంద్రం లేకుండా ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గుమ్మడిదలలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దార్ పరమేశానికి స్థానిక నాయకులు, ఆకుల ఆంజనేయులు, పలువురు వినతి పత్రం సమర్పించారు. తక్షణమే ఆధార్ ఏర్పాటు కోసం జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ పరమేశం హామీ ఇచ్చారు.

దేవస్థానానికి లాకర్ అందజేత



ఈవో అన్నపూర్ణకు లాకర్ అందిస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ భువనేశ్వరి

కొమురవెల్లి, జూలై18(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానానికి ఎస్‌బీఐ కొమురవెల్లి శాఖ లాకర్‌ను అందజేశారు. రూ.1,50,000 ల విలువ చేసే లాకర్‌ను శుక్రవారం ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ భువనేశ్వరి చేతుల మీదుగా ఆలయ ఈవో అన్నపూర్ణకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్,ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఎస్‌బీఐ సిద్దిపేట రీజినల్ మేనేజర్ కె.మారుతి, కొమురవెల్లి బ్రాంచ్ మేనేజర్ అర్జున్,ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వన దుర్గమ్మకు ఆషాఢ బోనం..

పాపన్నపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): వన దుర్గా మాతకు ఆషాడ బోనాలను సమర్పించి అదనపు కలెక్టర్ నగేష్ కుటుంబ సభ్యులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో ఏడుపాయలకు చేరుకున్న ఆయన కుటుంబ సభ్యులు బోనాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరంమేళ తాళాల చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి బయలుదేరారు. అమ్మవారికి బోనాలు వాడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, మరియు రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యా, సంక్షేమానికి ప్రభుత్వం కృషి



నార్సింగ్ పాఠశాలలో విద్యా బోధన చేస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

చేగుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తుందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం నార్సింగ్ మండలంలో పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ పాఠశాల, కళాశాలల సంక్షేమానికి పాటుపడాలని తల్లిదండ్రులు సహకరించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులను కూలీల కోసం పిల్లలను కళాశాలకు పాఠశాలకు పంపించకుండా వ్యవసాయ పనులను మాన్పించాలని తల్లిదండ్రులకు తెలిపారు. పాఠశాలలో, కళాశాలలో ఉపాధ్యాయులు అధ్యాపకులు మెదక్ జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలన్నారు. అనంతరం మండలంలోని వల్లూరు గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీవో ఆనంద్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఎదుట ఏబీవీపీ ఆందోళన

- బస్సు అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం

కొండాపూర్,జూలై 18(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ కార్యకర్తలకు ఓ స్కూల్ యాజమాన్య సిబ్బందికి తోపులాట జరిగింది. స్కూల్ బస్సు అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం అయిన సంఘటనలో ఏబీవీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై సోమేశ్వరి కథనం ప్రకారం.. శుక్రవారం ఏబీవీపీ కార్యకర్తలమని స్కూల్‌లోకి ప్రవేశించి విద్యార్థులచే సభ్యత్వ నమోదు చేయించాలని సిబ్బందిపై వత్తిడి తెచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో యాజమాన్యం, సిబ్బందికి కార్యకర్తల మధ్య మాట మాటా పెరిగి తోపులాటకు దారి తీసింది. దీంతో కార్యకర్తలు స్కూల్ ఫర్నీచర్, బస్సు అద్దాలను ధ్వసం చేసిన సమాచారంతో కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమతులు లేకుండా ఇంటర్నేషన్‌ల్ పేరుతో స్కూల్ నడుపుతూ విద్యార్థులను మోసం చేస్తున్నారని ఏబీవీపీ సభ్యులతో కలిసి స్కూల్ ముందు ఆందోళన దిగామని విభాగ్ కన్వీనర్ ఆకాశ్ తెలిపారు. విద్యార్థులకు అధిక ధరలకు స్కూల్ డ్రెస్, పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారని ఆందోళన చేపటాం. దీంతో విచక్షణ కోల్పోయి స్కూల్ యాజమాన్యం, సిబ్బంది దాడికి దిగారని ఆరోపించారు.

ప్రతి ఇంటి వద్ద పరిశుభ్రతను పాటించాలి

చిన్నశంకరంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఇంటి వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వెంకటయ్య అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిన్నశంకరంపేట మండల పరిధిలోని అంబాజీపేట గ్రామంలో పలువురు అధికారులు పర్యటించి ఇంటింటికి వెళ్లి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పాత కుండీలు, పాత టైర్లు, పాత డబ్బాలను తొలగించి, నిల్వ ఉంచిన నీటిని పారబోశారు. వర్షాకాలం నేపథ్యంలో పలు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కుండీలలో నీటిని నిల్వ ఉంచరాదని ఆయన అన్నారు. నీరు నిల్వ ఉండటంతో దోమలు తయారవుతాయని, దీంతో ప్రజలు రోగాల బారిన పడి ఇబ్బందులు పడతారని తెలిపారు. స్వచ్ఛతపై ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై సిబ్బందికి పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఏఎన్ఎం యాదమ్మ, పంచాయతీ కార్యదర్శి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బంగారు పతకం సాధించిన శిల్పకు సన్మానం

నారాయణఖేడ్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణానికి చెందిన మలమంచి శిల్ప కుటుంబ బాధ్యతలు మోస్తూనే చదువు కొనసాగిస్తూ నిజామాబాద్‌లోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో బీఈడ్‌లో ప్రతిభ చూపి బంగారు పతాకాన్ని సాధించడం అభినందనీయమని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ సంగారెడ్డి రీజియన్‌కార్యదర్శి నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఖేడ్‌లో సంస్థ తరఫున గురురాజశర్మ, శిల్ప దంపతులను శాలువాలతో సన్మానించారు.

600 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

మునిపల్లి, జూలై18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద శుక్రవారం మునిపల్లి పోలీసులు 600గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో ఇరానీ గల్లీలో ఎండు గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్ తరలిస్తున్నారన్న సమాచారంతో మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఎస్సై రాజేష్ నాయక్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో స్కూటీపై వెళ్తున్న వారిపై అనుమానం రావడంతో ఆపి తనిఖీ చేసి విచారించారు. వారి వద్ద 600గ్రాముల (ఎండు గంజాయిని) ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నాందేడ్ జిల్లాకు చెందిన అజింకే పండరి, వీరబోయిన శ్రీకాంత్‌లు బీదర్‌లోని ఇరానీ గల్లీకి చెందిన ఇర్ఫాన్ అనే వ్యక్తి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన ఎండు గంజాయితో పాటు స్కూటీని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు.

దాడికి పాల్పడ్డ వ్యక్తుల అరెస్ట్

కొమురవెల్లి, జూలై18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలంలోని అయినపూర్ గ్రామానికి చెందిన ఆలేటి రాంరెడ్డిని పోలీస్ స్టేషన్‌లో కారుతో ఢీకొట్టిన వ్యక్తితో పాటు, వైన్స్ పర్మిట్ రూంలో కర్రలతో దాడి చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఆలేటి రాంరెడ్డి భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆలేటి రాంరెడ్డిపై హత్యాయత్నానికి యత్నించిన అయినపూర్ గ్రామానికి చెందిన నాయిని ప్రతాప్ రెడ్డి, నాయిని యాదిరెడ్డి, రామపురం మహేశ్వర్ రెడ్డి, నాయిని వెంకటరెడ్డిని శుక్రవారం అరెస్ట్ చేసి హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దాడికి ఉపయోగించిన కారును, కర్రలను, 5సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తరగతి గదిలో కుప్పకూలిన ఉపాధ్యాయుడు

- గుండెపోటుతో సిద్దిపేట జిల్లా పీర్లపల్లిలో టీచర్ మృతి



సోమాచారి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, సంతాపం తెలుపుతున్న ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెబుతూ గుండెపోటుకు గురై కుప్పకూలాడో ఉపాధ్యాయుడు. సార్ ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పగానే, ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన కేతోజ్ సోమాచారి(55) పీర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఉదయం పాఠశాలకు వచ్చిన కొద్ది గంటల్లోనే ఛాతీలో నొప్పిగా ఉందని ప్రధానోపాధ్యాయుడు జలేందర్‌రెడ్డికి చెప్పాడు. వెంటనే టీచర్ సోమాచారిని వెంత తీసుకుని జగ దేవ్‌పూర్‌లోని ఓ ప్రైవేట్ క్లినిక్‌కు తీసుకువచ్చారు. గమనించిన వైద్యుడు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ఉపాధ్యాయుడి సోదరుడు, సీఆర్పీ బాలు కలిసి కారులో హైదరాబాద్ తీసుకువెళ్తుండగా మాదాపూర్ సమీపంలోకి వెళ్లగానే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమాచారి అకాల మరణం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో మాధవరెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, తోటి ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. సోమచారికి ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు సిద్దార్థ్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. నరేష్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సిద్దార్థ్ వచ్చే నెలలో యూఎస్ వెళ్లడానికి అన్నీ సిద్ధం చేయగా ఈ లోపు విషాదం జరిగింది. శనివారం చెంగిచర్లలో అంత్యక్రియలు జరుగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అత్యాచార కేసులో యువకుడికి ఏడేళ్ల జైలు

గుమ్మడిదల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల బాలికపై అత్యాచారం కేసులో యువకుడికి పోక్సో చట్టం ప్రకారం ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సంగారెడ్డి స్పెషల్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. ఇందుకు సంబంధించిన వివరాలు శుక్రవారం గుమ్మడిదల ఎస్సై భరత్‌భూషణ్ వివరించారు. గుమ్మడిదల మండలంలోని ఓ గ్రామానికి చెందిన రెండో తరగతి చదువుతున్న బాలిక(7) రోజు సాయంత్రం ట్యూషన్‌కి వెళ్లేది. రోజు మాదిరిగానే 2018 నవంబర్ 18 సాయంత్రం ట్యూషన్‌కి వెళ్లింది. అక్కడ గ్రౌండ్‌ఫ్లోర్‌లో నివాసం ఉంటున్న మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలానికి చెందిన నిందితుడు ఆకుల వీరేశం(అప్పటి వయసు 30) దాదాపు రాత్రి 7.30 గంటల సమయంలో బాలికను తన రూంలోపలికి తీసుకుని వెళ్లి అత్యాచారానికి పాల్పడాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు గుమ్మడిదల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ అనంతరం, ఏడేళ్ల తర్వాత సంగారెడ్డి జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి జయంతి నిందితుడు ఆకుల వీరేశంకు(37) ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

విద్యుదాఘాతంతో వాటర్‌మెన్ మృతి



మూగ నర్సింలు (ఫైల్)

హవేళిఘణపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గ్రామపంచాయతీ వాటర్ మెన్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. హవేళిఘణపూర్ గ్రామానికి చెందిన మూగ నర్సింలు(38) గ్రామ పంచాయతీ వాటర్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విధుల్లో భాగంగా గ్రామ పంచాయతీ బోరుమోటారు కాలిపోయింది. బాగు చేయించి, బోరులో మోటారును దింపి స్టాటర్ డబ్బాలో వైర్లు అమర్చుతుండగా కరెంట్ షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడిన నర్సింహులును చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నర్సింలు మరణించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

హవేళిఘణపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం హవేళిఘణపూర్ మండలంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం పర్వతాపూర్ గ్రామ పరిధిలోని కిషన్ తండాకు చెందిన దనావత్ శ్రీకాంత్ (21) వ్యవసాయం చేస్తుండేవాడు. ఈ నెల 11న ఇంటి నుంచి మెదక్ వెళ్తుండగా, మండలంలోని శమ్నాపూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న సిగ్నల్స్‌కు ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. మెదక్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని ఓ హస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి దేవులా ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజు తెలిపారు.

బోనాల పండగకు కూతురు వద్దకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో నిజాంపేట మహిళ మృతి



గెరుగంటి రేణుక (ఫైల్)

నిజాంపేట, జూలై18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారులోని బాచుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓమహిళ అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. పట్టణానికి చెందిన గెరుగంటి రేణుక (43) శుక్రవారం మధ్యాహ్నం బస్సులో దిగి.. రోడ్డు దాటుతున్న క్రమంలో ఎదురుగా వచ్చిన కారు బలంగా ఢీ కొట్టింది. దీంతో రేణుక అక్కడికక్కడే మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. రేణుక తన కూతురు బాచుపల్లి ప్రాంతానికి బోనాల ఉత్సవాల కోసం వచ్చి ప్రాణం మీదకు తెచ్చుకుంది. బాచిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ దుకాణంలో పీడీఎస్ బియ్యం పట్టివేత

మనోహరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల కేంద్రంలో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ అజయ్ కుమార్‌గౌడ్ దుకాణంలో గత నెల 10వ తేదీన రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ టీం అధికారుల సమాచారం మేరకు రేషన్ దుకాణంలో తనిఖీలు చేపట్టారు. దీంతో రేషన్ దుకాణంలో తనకు వచ్చిన కోటా కన్న అదనంగా 19 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని ఆర్‌ఐ దీక్షత్‌కు అప్పగించారు. దీంతో అతడి దుకాణంలో పరిమితి మించి బియ్యం ఉండటంతో డీలర్ అజయ్ కుమార్‌గౌడ్‌పై కేసు నమోదు చేశారు. అలాగే సీజ్ చేసిన బియ్యాన్ని మరొక రేషన్ దుకాణం టేక్మాల్‌కు చెందిన నవనీతకు అప్పగించారని తెలిసింది. ఈ విషయం జరిగి నెల రోజులకు పైగా గడుస్తున్నా మండల రెవెన్యూ సిబ్బంది మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ విషయం బయటకు చెప్పకపోవడం ఏమిటని ప్రజలు పలు అనుమాలు వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్ల తర్వాత మళ్లీ ఆ తండాలో సర్కారు బడి పునఃప్రారంభం

● సంతోషం వ్యక్తం చేస్తున్న గిరిజన వాసులు


తుకారంతండా పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న టీచర్

నర్సాపూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి) : పదేళ్ల క్రితం మూతపడిన నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని తుకారాంతండాలో ప్రాథమిక పాఠశాల తిరిగి ప్రారంభమైంది. పిల్లలు సరిగా రావడం లేదన్న కారణంతో గతంలో రద్దయిన ఈ పాఠశాల, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మళ్లీ మొదలైంది. దీంతో స్థానిక గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తుకారాంతండా నర్సాపూర్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. గతంలో ఐదో తరగతి వరకు బోధన జరిగే ఈ పాఠశాల మూతపడగా, తర్వాత పిల్లలు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సాపూర్ పట్టణంలో చదువుకోవాల్సి వచ్చేది. గతంలో రద్దయిన పాఠశాలలను తిరిగి పునరుద్ధరించే కార్యక్రమంలో భాగంగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో తుకారాంతండాలో మళ్లీ పాఠశాలను ప్రారంభించారు. ప్రస్తుతం ఐదు తరగతుల వరకు బోధన జరుగుతున్న ఈ పాఠశాలలో మూడు రోజుల క్రితమే తరగతులు మొదలయ్యాయి. సమీపంలోని కాగజ్‌మద్దూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయురాలిని తాత్కాలికంగా డిప్యూటేషన్‌పై కేటాయించారు. ఇప్పటికే 15 మంది విద్యార్థులు చేరారు. తమ తండాలోనే పాఠశాల తిరిగి ప్రారంభం కావడంతో చిన్న పిల్లలు ఐదో తరగతి వరకు అక్కడే చదువుకునే అవకాశం లభించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

నాచగిరి క్షేత్రం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ పునరుద్ధరణ

ఆలయం వద్ద ధర్మకర్తల మండలి తొలి సమావేశం

వర్గల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా వెల్లడించారు. శుక్రవారం ఆలయం వద్ద ధర్మకర్తల మండలి సభ్యులతో జరిగిన మొదటి సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్ పునరుద్ధరణకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి పంపించనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఆలయం వద్ద పనిచేస్తున్న సీసీ కెమెరాలతో పాటు అదనంగా మరికొన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సిబ్బంది సమయపాలన పాటించేందుకు బయోమెట్రిక్ అటెండెన్స్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఈవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు, ధర్మకర్తల మండలి సభ్యులు జగ్గయ్యగారి శేఖర్, దేశపతి ఉష్మశ్రీ, గాలి కిష్టయ్య, కొత్తపల్లి శ్రీనివాస్, జగ్గన్నగారి సురేందర్ రెడ్డి, తిరుమలరావు, రుద్ర శ్రీహరి, చందా నాగరాజు, జగన్నాథచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహ్మదాపూర్ యువకుడికి డాక్టరేట్

● గవర్నర్ చేతుల మీదుగా అందుకున్న అసిస్టెంట్ ప్రొఫెసర్


మధుకు డాక్టరేట్ పట్టా అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవవర్మ(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన రావుల మధు, ఈనెల 16న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవవర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన రావుల కనుకయ్య, భారతవ్వల కుమారుడైన మధు, గత పదేళ్లుగా కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్ వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో మధు పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈనెల 16న డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో జరిగిన రెండవ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవవర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా మధుకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. మధు డాక్టరేట్ సాధించడం పట్ల మహ్మదాపూర్ గ్రామ ప్రజలు, బంధువులు అభినందించారు.



మేకపిల్లను గావ్‌పట్టడం తిలకిస్తున్న భక్తజనం, అమ్మవారి ఆలయం వద్ద భక్తులు

సదాశివపేటలో వైభవంగా దుర్గమ్మ జాతర

అశేష భక్తజనం మధ్య పచ్చికుండ బోనం ఊరేగింపు

సదాశివపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసంలో పది రోజుల పాటు సాగిన సదాశివపేట దుర్గమ్మ మహాజాతర ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. హైదరాబాద్ బోనాల తర్వాత ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఈ జాతరకు ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి వేలాది భక్తులు తరలివచ్చారు. వందల ఏళ్ల నాటి ఆనవాయితీ మేరకు నిర్వహించిన పచ్చికుండ బోనం ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. గడీల ప్రసాద్‌గౌడ్ బోనాన్ని నెత్తిన పెట్టుకుని అమ్మవారికి సమర్పించారు. ఒంటినిండా పసుపు పూసుకున్న నదర్‌లింగమయ్య, ఒంటి నిండా కుంకుమ పూసుకున్న పోతరాజుల విన్యాసాలు భక్తులను ఉర్రూతలూగించాయి. పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కల్లుపోతు ఊరేగింపులో డప్పుల దరువులు, డీజే సౌండ్‌లతో పురవీధులు దద్దరిల్లాయి. నదర్‌లింగమయ్య, పోతరాజులు మేక, గొర్రెపిల్లలను గావ్ పట్టడంతో ఉత్సవాలు ముగిశాయి.




కలుపు యంత్రంతో చకచకా

కంది మండలం కాశీపూర్ గ్రామంలో రైతు ఎండీ రజాక్ రైతుల కొరతను అధిగమించేందుకు కలుపు యంత్రాన్ని తయారు చేశాడు. ఆ యంత్రం సాయంతోనే తన మూడు ఎకరాల భూమిలో రెండు గంటల సమయంలోనే కలుపు తీస్తున్నాడు. దీనికి మూడు లీటర్ల పెట్రోల్ ఖర్చవుతుందని, మెషీన్‌కు రూ.40 వేలు వెచ్చించినట్టు రజాక్ తెలిపారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి జిల్లా

సుందరకాండ పుస్తకమే పెళ్లిపత్రిక


రామయణ సుందరకాండ పుస్తకం, అందులోని పెళ్లి పత్రిక

నారాయణఖేడ్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వివాహాలకు ఆహ్వానించడానికి ఆర్భాటంగా భారీ ఖర్చుతో పెళ్లి పత్రికలను వేసి తమ గొప్పతనాన్ని చాటుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. కానీ, కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన కోట రాజులు, నాగరాణి దంపతులు వినూత్నంగా సుందరకాండ పుస్తకంపై పెళ్లి పత్రికను ముద్రించి బంధుమిత్రులను ఆహ్వానిస్తున్నారు. ఆగస్టు 6న పిట్లంలో కోట నాగరాణి, రాజుల కొడుకు రవిచంద్ర వివాహం నందినితో జరగనుంది. ఇందుకు సంబంధించిన పెళ్లి పత్రికను శుక్రవారం నారాయణఖేడ్‌లోని వారి బంధుమిత్రులకు అందజేశారు. సుందరకాండ ప్రాముఖ్యతను ప్రతీ ఒక్కరికి తెలియాలని, ప్రతీ ఇంటిలోనూ ఈ పుస్తకం ఉండాలనే సంకల్పంతో ఈ ఆలోచన చేసినట్లు వారు పేర్కొంటున్నారు. వెయ్యి పత్రికలను పంపిణీ చేసినట్లు తెలిపారు. వారి ఆలోచనను పలువురు ప్రశంసిస్తున్నారు.


తూప్రాన్ సమీకృత మోడల్ మార్కెట్

నిరుపయోగంగా సమీకృత మార్కెట్

తూప్రాన్‌లో కోట్లు వెచ్చించి నిర్మాణం

ఖాళీగా షెట్టర్లు, స్టాళ్లు

తూప్రాన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో అధునాతన వసతులతో నిర్మించిన సమీకృత మార్కెట్ (వెజ్, నాన్‌వెజ్) నిరుపయోగంగా మారింది. ప్రారంభమైన కొద్ది రోజుల నుంచే షెటర్లు, స్టాళ్లు ఖాళీగా ఉండగా, ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతోంది.

గజ్వేల్ తరహాలో తూప్రాన్‌లోనూ సమీకృత మార్కెట్‌ను అప్పటి సీఎం కేసీఆర్ మంజూరు చేశారు. ఇందుకు మార్కెటింగ్‌శాఖ రూ.4.50 కోట్లు, గడ ప్రత్యేక నిధులు రూ.5.80 కోట్లు మంజూరు చేయగా 2022లో మార్కెట్ నిర్మాణం పూర్తి చేశారు. గడ ప్రత్యేక నిధులు రూ.60 లక్షలతో లిఫ్ట్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో కమర్షియల్ (వాణిజ్య) దుకాణాలు 20, కూరగాయల స్టాళ్లు 28, కార్యాలయ గది, కోల్డ్‌స్టోరేజీ గది, క్యాంటీన్, ఎలక్ట్రికల్ గది, టాయిలెట్‌లను నిర్మాణం చేశారు. ఫస్ట్ ఫ్లోర్‌లో మటన్ స్టాళ్లు 24, చికెన్ స్టాళ్లు 22, చేపల స్టాళ్లు 8, చేపలు శుభ్రపరిచే స్థలం, టాయిలెట్లు నిర్మాణం చేశారు. సెకండ్‌ఫ్లోర్‌లో కమర్షియల్ స్థలాలు (సూపర్ మార్కెట్, బంకెట్ హాల్, బ్యాంకు), టాయిలెట్, టెర్రస్‌లో నీటిశుద్ధి ప్లాంటు, వాటర్‌ట్యాంకు ఏర్పాటు చేశారు. 2022 సెప్టెంబర్ 2న అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభోత్సవం చేశారు. ప్రారంభోత్సవం చేసిన కొద్దిరోజులు వ్యాపారులు అక్కడే కూరగాయలు, చికెన్, మటన్ అమ్మకాలు చేశారు. అయితే, వ్యాపారం సక్రమంగా సాగడంలేదంటూ ఒక్కొక్కరుగా పాత దుకాణాల వద్దకు వెళ్లారు. మాంసం దుకాణాలు సైతం ఒక్కొక్కటిగా రోడ్డు పక్కన బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో దుకాణాలు, స్టాళ్లు 96 ఉండగా, ప్రస్తుతం ఓ చికెన్ దుకాణం, రెండు కూరగాయల దుకాణాలు, ఒక కూరగాయల స్టాల్‌తో నాలుగు దుకాణాలే కొనసాగుతున్నాయి. వ్యాపారం ఎక్కువగా సాగకపోవడంతో దుకాణాలు నిర్వహిస్తున్న ఒకరిద్దరు అద్దెలు చెల్లింపులు చేయడంలేదు.


దుమ్ము పట్టిన చికెన్, మటన్ స్టాళ్లు

కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ఈ మార్కెట్ ప్రస్తుతం దుమ్ము, ధూళితో నిండిపోయి, దుర్వాసన వెదజల్లుతోంది. టాయిలెట్లు శుభ్రం చేయకపోవడం, తాగునీటి వ్యవస్థ పనిచేయకపోవడంతో అధ్వానంగా మారింది. అంతేకాకుండా, కొనుగోలుదారుల కోసం నిర్మించిన భారీ పార్కింగ్ స్థలం ఇప్పుడు వాహనదారులకు శాశ్వత పార్కింగ్ ప్రదేశంగా మారింది. రాత్రి పూట కార్ల పార్కింగ్ ఎక్కువగా జరుగుతోంది.



దుకాణాలన్నీ ఉంటే వ్యాపారం బాగా సాగుతుంది

తూప్రాన్ సమీకృత మార్కెట్‌లో దుకాణాలు లేకపోవడంతో వ్యాపారం సాగడంలేదు. ఏదో కొద్దిపాటి వ్యాపారం జరుగుతుంది. దుకాణాలన్నీ ఇక్కడే ఉంటే మంచి వ్యాపారం సాగుతుంది. మొదట్లో వ్యాపారం బాగానే సాగింది. దుకాణాలన్నీ ఊర్లోకి వెళ్లడంతో ఇక్కడికి వచ్చేవారు తక్కువయ్యారు.

- స్వరూప, కూరగాయల స్టాల్ వ్యాపారి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

● ప్రజలతో సంబంధాలున్న అభ్యర్థుల ఎంపిక

● కరీంనగర్ ఎంపీ బండి సంజయ్

అక్కన్నపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ అధిక స్థానాల్లో గెలిచేందుకు కృషి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జనగామ జిల్లా పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో అక్కన్నపేటలో ఆగి బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలతో ఎక్కువ సంబంధాలు కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఏఏ గ్రామాల్లో అభివృద్ధి పనులు, కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్లు కావాలో జాబితా తయారుచేసి ఇస్తే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, నాయకులు చెరుకు సంపత్, నూనవత్ మోహన్‌నాయక్, జంగపల్లి శ్రీనివాస్, జన్నారపు కళ్యాణ్‌విష్ణు, దూలం మల్లేశం, వంగల భాస్కర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, మాధవరెడ్డి, చాడ శ్రీనివాసరెడ్డి, కాశబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


అక్కన్నపేటలో బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాల్సిందే

కొత్త విషయాలు నేర్చుకోవాలి

సామాజిక మార్పులకనుగుణంగా మారాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మీడియా, రాజకీయ రంగాల్లోని వారు నిత్యం సామాజిక మార్పులకు, అవసరాలకనుగుణంగా తమని తాము తీర్చిదిద్దుకోవాలని, ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్కింగ్ జర్నలిస్టుల పునశ్చరణ శిక్షణ తరగతుల ప్రారంభ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సామాజిక అంశాలపై జర్నలిస్టులు ఫోకస్ చేయాలన్నారు. ప్రభుత్వాన్ని కదిలించే విధంగా ప్రజలకు అవసరమయ్యేలా కథనాలు రాయాలన్నారు. జర్నలిస్టులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించే విషయంపై అసెంబ్లీలో చర్చిస్తానని హామీ ఇచ్చారు. సిద్దిపేట జర్నలిస్టులకు తన సొంత డబ్బు రూ.10 లక్షలతో బీమా సౌకర్యం కల్పిస్తానని ప్రకటించారు. అంతకుముందు మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయన్నారు. సాంకేతికతను సమగ్రంగా తెలుసుకుంటే వార్తలు సేకరణ సులభం అవుతుందని సూచించారు. త్వరలోనే మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఏఐ అనే అంశంపై సెమినార్ వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, సీనియర్ సంపాదకులు ఆర్వీ రామారావు విలేకరులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మీడియా అకాడమీ కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరావు, టీయూడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీశ్‌రావు

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

● ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్

జహీరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషి అమోఘమని జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మహిళా శక్తి సంబురాలు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమాజంలో మహిళా సంఘాల సభ్యులు పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులు, క్యాంటీన్ల నిర్వహణ, అల్లికలు, కుట్లు వంటి రంగాల్లో రాణిస్తూ పదిమందికి ఉపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పించిన నేపథ్యంలో, ఇక్కడి ఆడబిడ్డలు కూడా అందులో ఉండాలని కోరుకున్నారు. జహీరాబాద్ నియోజకవర్గానికి వచ్చే ఐదేళ్లలో పెద్ద మొత్తంలో ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగా నియోజకవర్గంలోని ఆయా మండలాలకు సంబంధించిన మహిళా సంఘాల సభ్యులకు వివిధ పథకాల కింద సుమారు రూ.46 కోట్ల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐడీసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, డీఆర్డీవో పీడీ జ్యోతి, అదనపు పీడీ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.


మహిళాసంఘాల సభ్యులకు చెక్కులను అందజేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

ఆదర్శ ఉపాధ్యాయులు

● పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన టీచర్లు

● ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్య అందుతుందనే భరోసా కల్పన

మెదక్, కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నేటి రోజుల్లో విద్యకు ఉన్న విలువ అంతా ఇంతా కాదు. ఇదే అదునుగా ప్రైవేటు పాఠశాలలు ఇంటర్నేషనల్ సిలబస్, ఐఐటీ, నీట్ కోచింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అంటూ ప్రచార ఆర్భాటంతో పట్టణాలతో పాటు మారుమూల పల్లెల్లోనూ హోరెత్తిస్తున్నాయి. తల్లిదండ్రులను ఆకట్టుకుంటూ లక్షలాది రూపాయల ఫీజులు దండుకుంటున్నాయి. నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకంతో కొందరు, గొప్పలకు పోయి మరికొందరు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చదివిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో చేర్పగా, మరికొందరు తాము పనిచేసే పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలలే ఉత్తమమంటూ ఆచరణలో చూపిస్తున్న ఉపాధ్యాయుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఘనపూర్ పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ రజని తన పిల్లలను అదే పాఠశాలలో చేర్చారు. కౌడిపల్లి మండలంలోని అవుసులపల్లి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ తన పిల్లలను ఘనపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేర్చారు. అలాగే, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు దేవుల కూడా తన పిల్లలను ఘనపూర్ పాఠశాలలో చేర్చి అందరికీ ఆదర్శంగా నిలిచారు.


ప్రధానోపాధ్యాయుడి చేతుల మీదుగా తమ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు మొహమ్మద్ అలీ అక్బర్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నేను మెదక్ జిల్లా కేంద్రంలోని న్యూ హై స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా గణితాన్ని బోధిస్తున్నాను. నా కుమారుడు జావేద్ అలీని ఎనిమిదో తరగతిలో నేను పని చేసే పాఠశాలలోనే చేర్చాను. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.

- మొహమ్మద్ అలీ అక్బర్, స్కూల్ అసిస్టెంట్, న్యూ హైస్కూల్, మెదక్

ప్రభుత్వ పాఠశాలలపై భరోసా కల్పించడమే లక్ష్యం



ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో, నేను పని చేసే కూచన్‌పల్లి పాఠశాలలో నా ఇద్దరు పిల్లలైన కీర్తిప్రియ (9వ తరగతి), అమర్త్య (6వ తరగతి)ని చేర్చాను. ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలల పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారు. కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య లభిస్తుందనే నమ్మకాన్ని కలిగించాలంటే, ముందుగా మనమే ఆచరించాలని భావించి నా పిల్లలను మా పాఠశాలలో చేర్చాను.

- శశికుమార్, తెలుగు పండిత్, కూచన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల

న్యూస్ బాక్స్

డీఎంహెచ్‌వోను కలిసిన హెచ్1 యూనియన్ అధ్యక్షుడు

కొండపాక, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ధన్‌రాజును తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ హెచ్1 యూనియన్ జిల్లా అధ్యక్షుడు గాలి రమేష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామ కమిటీల నియామకాన్ని వేగవంతం చేయండి

నంగునూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల నియామకంతో పాటు జెండా పండుగ కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజు మాదిగ అన్నారు. శుక్రవారం నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి గ్రామ నిర్మాణ కమిటీలు పూర్తిచేసుకుని వచ్చే నెల ఆగస్టు 13న ఎల్బీ స్టేడియం హైదరాబాదులో జరిగే దివ్యాంగుల మహాగర్జన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అనుమతి లేని వెంచర్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

కొమురవెల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురువన్నపేట గ్రామంలో జీపీ అనుమతి, నియమ నిబంధనలను పాటించకుండా ఏర్పాటు చేసిన ఓ వెంచర్ హద్దురాళ్లను శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి చిలుక కరుణాకర్ సిబ్బందితో తొలగింపజేశారు. తొలగించిన హద్దు రాళ్లను ఎంపీడీవో శ్రీనివాస్ వర్మ పరిశీలించారు. అనుమతి లేకుండా వెంచర్ చేసిన వారిపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయన్నారు.

కొండపోచమ్మ సాగర్ ద్వారా ప్రజ్ఞాపూర్ ఊరచెరువు నింపాలి

గజ్వేల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ సాగర్ ద్వారా ప్రజ్ఞాపూర్ ఊరచెరువును నింపాలని బీజేపీ నాయకులు సల్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఊర చెరువు నీళ్లు లేక వట్టిపోయిందని, వెంటనే ప్రభుత్వం స్పందించి నీటితో ఊర చెరువును నింపాలని డిమాండ్ చేశారు.

గీతకార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎక్సైజ్ సీఐ

చేర్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చేర్యాల ఎక్సైజ్ సీఐ నర్సింహులు అన్నారు. కల్లుగీత కార్మికసంఘం నాయకులు శుక్రవారం చేర్యాల ఎక్సైజ్ సీఐ నర్సింహులును కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ గీత కార్మికుల సమస్యలను విన్నవించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అనగోని నర్సింహులు, ఆకుల కనకయ్య, పోతుగంటి లింగం, తాళ్లపల్లి కనకయ్య, నాచగోని శ్రీనివాస్, బందారం కనకాంబరం, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

గజ్వేల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ ముంపు గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిషనర్ చెట్లపల్లి బాలకృష్ణకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు.

సైకిళ్లపై కరీంనగర్ నుంచి కొమురవెల్లి దేవస్థానం వరకు..



కొమురవెల్లికి చేరుకున్న సైక్లిస్టులు

కొమురవెల్లి,జూలై18(ఆంధ్రజ్యోతి) సైక్లింగ్‌పై మక్కువతో ముగ్గురు యువకులు కరీంనగర్ నుంచి కొమురవెల్లి దేవస్థానం వరకు శుక్రవారం సైక్లింగ్ చేశారు. ఈ సందర్భంగా సైక్లిస్టులు వి.తిరుపతి రెడ్డి, ఏ.రవీందర్, అర్వల్ సింగ్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా సైక్లింగ్‌పై మక్కువతో సమయం దొరికినప్పుడల్లా లాంగ్ సైక్లింగ్ చేస్తున్నట్టు తెలిపారు. స్వామివారి దర్శనం అనంతరం తిరిగి కరీంనగర్ చేరుకునేసరికి 300 కిలోమీటర్ల ప్రయాణం చేసినట్టవుతుందని తెలిపారు. సైక్లింగ్ వల్ల ఆరోగ్య సమాజాన్ని నిర్మించవచ్చని, వాతావరణ కాలుష్యాన్ని కూడా అరికట్టవచ్చన్నారు.

నమూనాయే లేదు.. అవగాహన ఎలా?

- చిన్నకోడూరులో పిల్లర్ గుంతలకే పరిమితమైన ఇందిరమ్మ మోడల్ హౌస్
- పనులు ప్రారంభించి నెలలు గడిచినా ముందుకు సాగని వైనం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల అభ్యంతరాలు



పిల్లర్ గుంతల స్థాయిలోనే నిలిచిన ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులు

చిన్నకోడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందిరమ్మ ఇళ్లను ఒకే నమూనాలో నిర్మించాలనే లక్ష్యంతో అర్హులైన లబ్ధిదారులకు రూ. 5 లక్షలతో ఇంటి నిర్మాణం ఎలా చేపట్టాలో చూపేందుకు ప్రతీ మండల కేంద్రంలో నమూనా ఇంటిని నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగానే చిన్నకోడూరు మండలం కేంద్రంలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు పిల్లర్ గుంతలకే పరిమితమయ్యాయి. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు.

స్థలం ఎంపికపై నాయకుల అభ్యంతరాలు

చిన్నకోడూరు మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వెనక ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను నిర్మించేందుకు సుమారు ఆరు నెలల క్రితం అధికారులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఐకేపీ కార్యాలయం వెనక నిర్మిస్తే ప్రజలకు కనబడకుండా ఉందని జనాకర్షణ ప్రదేశంలో నిర్మించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవోకు వినతి ప్రతం అందజేశారు. మరో చోట నిర్మించేందుకు అధికారులు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ శాశ్వత అవసరాలకు, ప్రభుత్వ సమావేశాలకు అనుకూలంగా ఉన్న ఖాళీ స్థలాన్ని కాపాడాలని గతంలో నిర్మించ తలపెట్టిన స్థలంలోనే (ఐకేపీ కార్యాలయం వెనక) ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను నిర్మించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. దీంతో తహసీల్దార్ కార్యాలయం పక్కన నిర్మించేందుకు అధికారులు స్థల పరిశీలన చేయగా మోడల్ హౌస్ నిర్మాణానికి సరిపడా స్థలం లేకపోవడంతో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి బ్రేక్ పడింది. దీంతో అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నమూనాకు సంబంధించి ఎలా అవగాహన కల్పిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి రెండు పార్టీల నాయకులు అభ్యంతరాలు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికను పంపించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోడల్ హౌస్ నిర్మాణ పనులు చేపడతాం.

-జనార్దన్, ఎంపీడీవో, చిన్నకోడూరు

ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తి చేయాలి



మద్దూరులో ఇందిరమ్మ లబ్ధిదారులతో మట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్

మద్దూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మద్దూరు గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులతో పాటు స్టోర్‌రూంను పరిశీలించారు. ఆస్పత్రి పునరుద్ధరణలో భాగంగా చేపడుతున్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయించాలని పీఆర్ ఏఈ గౌస్ ఖాద్రీకి సూచించారు. వెంట మండల ప్రత్యేకాధికారి డీపీవో రాధిక, ఎంపీడీవో ఎస్. రాంమోహన్, తహసిల్దారు రహీం, ఎంపీవో వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ చిన్ను సహాని ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



గౌరవెల్లిలో సీసీ రోడ్లను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

అక్కన్నపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర బృందం సభ్యుడు వినోద్, జోసెఫ్ పేర్కొన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామాన్ని కేంద్రబృందం సందర్శించింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 12 రకాల పథకాల అమలు తీరును పరిశీలించారు. గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, డంపింగ్ యార్డులు, నర్సరీలను పరిశీలించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందించే రుణాల పైన అడిగి తెలుసుకున్నారు. ఇందులో ఎంపీడీవో బానోతు జయరామ్, మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ భైరగోని శ్రీనివాస్, ఎంపీవో గుగులోతు మోహన్, ఏపీఎం శ్రీనివాస్,ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మర్పడగలో పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి

కొండపాక, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. మండలంలోని మర్పడగలో శుక్రవారం డ్రై డే సందర్భంగా పలు వీధుల్లో పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలం దోమలు ప్రబలే ఆస్కారం ఉన్నందున నీటిని ఎక్కువగా నిలువ ఉంచుకోకూడదన్నారు. పరిసరాల్లో ఎక్కడ కూడా నీటి నిల్వ లేకుండా చూడాలని సూచించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని ప్రజలకు సూచించారు. పలు వీధుల్లో తిరిగి ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ వైద్య సిబ్బంది తదితరులున్నారు.

నానో యూరియాతో మొక్కలకు చీడపీడలను తట్టుకునే శక్తి



సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో స్వరూపరాణి

గజ్వేల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో మొక్కలకు చీడపీడలను తట్టుకునే శక్తి పెరుగుతుందని సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ డీలర్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ..నానో యూరియా వాడటం వలన వ్యవసాయ ఉత్పత్తుల ఉత్పాదకత, నాణ్యతను మెరుగుపరుస్తుందని, గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. నానో యూరియా వాడటం విత్తనాల అంకురోత్పత్తిని మెరుగుపరుస్తుందని, మొక్కల సేంద్రియ రసాయన ఎరువుల పోషక వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. నానో యూరియా, డీఏపీ పంటలపై పిచికారి మాత్రమే చేయాలన్నారు. డ్రిప్‌లో గాని, ఇసుకలో గానీ కలిపి పంటలను వేయవద్దన్నారు. సమావేశంలో గజ్వేల్ వ్యవసాయ శాఖ ఏడీ బాబునాయక్, గజ్వేల్ మండల వ్యవసాయాధికారి గుండు నాగరాజు, ఇఫ్కో సంస్థ మేనేజర్ కృపాశంకర్, జిల్లా మేనేజర్ చంద్రబాబునాయుడు, డీలర్లు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

జగదేవ్‌పూర్‌లో కన్యకా పరమేశ్వరి ఉత్సవాలు

జగదేవ్‌పూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని వెంకటేశ్వర ఆలయంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శాకాంబరి అలంకరణలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. జగదేవ్‌పూర్ ఆర్యవైశ్య మహాసభ పట్టణ, మండల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని పూలతో అలంకరించి, పంచామృతాలతో అభిషేకం చేశారు. అమ్మవారి జీవిత చరిత్ర పారాయణం, కుంకుమ పూజలు,మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు.

ఆకునూరు జడ్పీఎస్ఎస్‌లో ఉచిత వైద్యశిబిరం

చేర్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్‌లో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేటకు చెందిన శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు 250మంది విద్యార్థులకు సాధారణ, దంతవైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యబృందం ఎల్.శ్రీనివాస్, అరవింద్, నితిన్, అఖిల, పాఠశాల హెచ్ఎం అయిలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఆర్డీవో పీడీ

చిన్నకోడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని గదులను, ల్యాబ్‌ను, ఫార్మసీని, స్టోర్ రూం, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను గూర్చి పీహెచ్‌సీ వైద్యురాలు ఐశ్వర్యను అడిగి తెలుసుకున్నారు. వెంట ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో సోమిరెడ్డి, ఉపాధి హమీ ఏపీవో స్రవంతి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో నైతిక విలువలు కీలకం

- ప్రముఖ సైకాలజిస్టు జి. శివప్రసాద్

గజ్వేల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మనిషి జీవితంలో నైతిక విలువలు కీలకమని ప్రముఖ సైకాలజిస్టు జి. శివప్రసాద్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మంజీరా కాన్సెప్ట్ స్కూల్‌లో నిర్వహించిన నైతిక మార్గదర్శకత్వం అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంద అంబాదాసు, డైరెక్టర్ రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఎఫ్‌పీవోల ఏర్పాటు

ములుగు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చిన్న, సన్నకారు రైతులు అందుబాటులో ఉన్న భూ సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలని సహకార శాఖ డివిజన్ అధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం నాణ్యమైన, చవకైన ఉత్పత్తులను అందించడమే ధ్యేయంగా పీఏసీఎస్‌లకు అనుబంధంగా ప్రభుత్వం ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రతీ ప్రాథమిక పాఠశాలకు హెచ్ఎం పోస్టు మంజూరు చేయ్యాలి

- పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ

వర్గల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి : వర్గల్ మండల పరిధిలో శుక్రవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో ఉన్న విధంగా ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ప్రత్యేకంగా ప్రధానోపాధ్యాయుడి పోస్టు మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు ఉపయోగించకూడదన్నారు. త్వరలోనే ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు రానున్నట్లు చెప్పారు. పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, సభ్యులు తదితరులు ఉన్నారు.

ముగిసిన మహిళాశక్తి సంబరాలు

వర్గల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు శుక్రవారం ఘనంగా ముగిసాయి. ఈ వేడుకల సందర్భంగా మహిళలందరితో రంగోలి పోటీలు నిర్వహించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో ముగింపు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఆనంద్‌కుమార్, తాళ్ల రేణుక, సీసీలు పాల్గొన్నారు.

దౌలాపూర్‌లో వృద్ధుడు అదృశ్యం

జగదేవ్‌పూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌలాపూర్‌లో ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దౌలాపూర్ గ్రామానికి చెందిన ఈరమైన వెంకటయ్య(70) ఈ నెల 12న ఇంటి నుంచి రాజాపేట మండలం బసంతాపూర్ గ్రామంలో తెలిసినవారి ఇంటికి వెళ్లాడు. అయితే తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం వెంకటయ్య కుమారుడు మైసయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 16 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం నిందితులకు రూ.34వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో ఓటు వేస్తున్న విద్యార్థి

చిన్నకోడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం మాక్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాల్గొని వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సతీష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

చిన్నకోడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : చదువుతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గోనెపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం గ్రామానికి చెందిన కూర రాజేందర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో 130 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సైఫ్ అలీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌కు అన్ని పార్టీలు మద్దతివ్వాలి

దుబ్బాక, జూలై 18(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్‌కు అన్ని రాజకీయపార్టీలు మద్దతు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం దుబ్బాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 42శాతం బీసీ రిజర్వేషన్‌లకు పార్లమెంట్‌లో అన్ని రాజకీయపార్టీలు మద్దతు ఇచ్చి, బిల్లును పాస్ చేయాలని కోరారు. రాష్ట్రంలో త్వరలోనే జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు అన్ని పార్టీలు 42శాతం రిజర్వేషన్‌లు అమలుచేయాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆకుల దేవేందర్, రామచంద్రం, సందీప్, నారాగౌడ్, గాలయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ అసత్యప్రచారం తగదు

చేర్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తుందని, ఇది గిట్టని బీఆర్ఎస్ నాయకులు తామే అందిస్తున్నామని గొప్పలు చెబుతూ అసత్యప్రచారం చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండలాధ్యక్షుడు కొమ్ము రవి పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రాంతంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ క్షీరాభిషేకాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో నాయకులు మంజె మల్లేశం, ఆడెపు చంద్రయ్య, తడక లింగం, పాల లక్ష్మినారాయణ, బూడిద కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి

మిరుదొడ్డి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మంజూరైన తారురోడ్డు పనులను ప్రారంభించడంలో కాంగ్రెస్‌ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోటకమలాకర్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె, మిరుదొడ్డి మండలం కాసులాబాద్, మిరుదొడ్డి గ్రామానికి కంకర తేలిన రోడ్డుపై గ్రామస్థులతో కలిసి పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుంతలయమంగా మారిన రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రాణాలుపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అందె, కొండాపూర్, లక్ష్మీనగర్ గ్రామాలకు వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా మారాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్ రెడ్డి కృషితో రోడ్డు పనులకు నిధులు మంజూరైనా నేటికీ పనులు ప్రారంభించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంజిరెడ్డి, తుమ్మలబాల్‌రాజు, పోలీస్‌రాజులు, సత్యనారాయణ, వంజరి శ్రీనివాస్,బిక్షపతి, లింగం, రాజేశ్వర్, తదితరులున్నారు.

బ్యాంకు అధికారుల వేధింపులు ఆపాలి

గజ్వేల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు అధికారుల వేధింపులు ఆపాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. ఈ మేరకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ చెట్లపల్లి బాలకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులకు డబ్బులు ఇవ్వకుండానే లోన్లు కట్టాలంటూ ఫోన్ చేస్తూ బెదిరిస్తున్నారని, బ్యాంకు అధికారుల వేధింపులు ఆపాలన్నారు. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమానికి దిగుతామని హెచ్చరించారు.



సిద్దిపేట పట్టణంలో భారీవర్షంతో జలమయమైన రోడ్డు

కరుణించిన వరుణుడు

(3వ పేజీ తరువాయి)

ధర్మారం, పోతారం(జే), నందారం, కఫూర్‌నాయక్‌తండా, మసిరెడ్డితండా, మల్చెరువుతండా, రేగొండ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కుంటలు, వాగులు పొంగిపొర్లాయి. నందారం, కఫూర్‌నాయక్ తండా మధ్య ఉన్న వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించాయి. పంట చేనుల్లో నీళ్లు నిలిచాయి.

రోడ్లన్నీ జలయమం

సిద్దిపేట పట్టణంలో శుక్రవారం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పట్టణంలో పలుచోట్ల రోడ్ల మీదకు నీళ్లు చేరాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



తొగుటలో కురుస్తున్న భారీ వర్షం

క్రాంతిలో బోనాల సందడి



సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్రాంతి పాఠశాలలో శుక్రవారం స్కూల్ ఛైర్‌పర్సన్ అర్పితారెడ్డి ఆధ్వర్యంలో బోనాల పండుగను అట్టహాసంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయబద్ధంగా బోనాలతో నిర్వహించిన ఊరేగింపులో డప్పుచప్పుళ్ల మధ్య పోతరాజుల వేషధారణతో విన్యాసాలు అందరినీ అలరించాయి. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించారు. భవిష్యవాణి చెప్పిన విద్యార్థిని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

- సిద్దిపేట కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి)